క్లుప్తంగా

3న రుణమేళా

వినుకొండ: బీసీ, ఈబీసీ, కాపు, జనరక్ ఫార్మసీ అభ్యర్థులకు స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని గుర్రం జాషువా కళాప్రాంగణంలో ఈ నెల 3వ తేదీ రుణమేళా నిర్వహించనున్నట్లు కమిషనర్ సుభాష్‌చంద్రబోస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీసీ, ఈబీసీ, కాపు సెలక్షన్ కమిటీల ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేయడం జరుగుతుందని పేర్కొన్నారు.

రూ.50 లక్షలతో దేవాలయ పునర్నిర్మాణం



శావల్యాపురం: మండలంలోని వేల్పూరులో రూ.50 లక్షలతో గంగమ్మ తల్లి దేవాలయం పునః నిర్మాణ పనులు తుది దశకు చేరినట్లు ఆలయ కమిటీ ప్రతినిధి ముండ్రు రాఘవరావు సోమవారం తెలిపారు. ఈసందర్భంగా మాట్లాడుతూ గ్రామస్తులు, దాతలు సహకారంతో దేవాలయ నిర్మాణ పనులు చేపట్టినట్లు చెప్పారు. తిరుమల-తిరుపతి దేవస్థానం రూ.10 లక్షలు సహకారం అందించినట్లు వివరించారు. ప్రస్తుతం రంగులు వేస్తున్నారని, ఈనెల 21 నుంచి దేవాలయ ప్రతిష్టా కార్యక్రమం ప్రారంభమవుతాయని 23న గంగమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టా కార్యక్రమం వైభవంగా జరుగుతుందని వివరించారు.

ఆలయానికి 20 కుర్చీలు అందజేత

నరసరావుపేట రూరల్: ఎన్‌జీవో కాలనీలో నిర్మాణంలో ఉన్న అష్టలక్ష్మీ దేవాలయానికి రిటైర్డ్ పంచాయతీ కార్యదర్శి అర్వపల్లి శేఖర్, నాగ అరుణకుమారి దంపతులు 20 కుర్చీలను అందజేశారు. ప్రతిష్టా మహోత్సవానికి సిద్ధమవుతున్న ఆలయానికి తన వంతు విరాళంగా కుర్చీలను అందజేసినట్టు శేఖర్ తెలిపారు. కార్యక్రమంలో శేఖర్ తనయుడు ధీరజ్ మురగన్ సాయి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పేరంటాళ్లమ్మ ఆదాయం రూ.6 లక్షలు



శావల్యాపురం: మండలంలోని శానంపూడి శివారు గ్రామమైన బొందిలిపాలెంలోని అడవి పేరంటాళ్లమ్మ అమ్మవారి ఆలయ తిరునాళ్ల సందర్భంగా దేవాలయానికి ఆదాయం రూ.6 లక్షల 37 వేల 158 వచ్చినట్లు దేవదాయ శాఖ అధికారి ఎం.సుధాకర్‌రెడ్డి సోమవారం తెలిపారు. బహిరంగ వేలం ద్వారా రూ.లక్ష 36 వేల 500, భక్తులు విరాళాల రూపంలో ఇచ్చిన నగదు రూ.2 లక్షల 90 వేల 741, హుండీ కానుకల ఆదాయం రూ.ఒక లక్ష 91 వేల 587, చీరలు వేలంలో రూ.18 వేల 330 ఆదాయం వచ్చినట్లు తెలిపారు. గత ఏడాది కంటే ఈసారి అదనంగా ఆదాయం వచ్చినట్లు చెప్పారు. అధికారులు హనుమంతరావు పి.వెంకటరెడ్డి, అమ్మిరెడ్డి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

మీసాల శ్రీనివాసరావుకి సన్మానం



వినుకొండ: స్థానిక బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన న్యాయవాది మీసాల శ్రీనివాసరావును ఆయన కార్యాలయంలో నియోజకవర్గ యాదవ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. సన్మానించిన వారిలో యాదవ సంఘం నాయకులు ఆలా శ్రీనివాసరావు, మద్దుల సత్యనారాయణ, రావులపల్లి కొండ గురవయ్య, బత్తుల శ్రీనివాసరావు, కన్నెబోయిన వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు, కిష్టం శ్రీనివాసరావు, నర్రా శ్రీను, ఒంటేల శ్రీనివాస్ యాదవ్, కన్నెబోయిన బాలకృష్ణ, కొండలు, తెల్లమేకల శ్రీనివాసరావు యాదవ్ ఉన్నారు.

ఉచిత వాటర్ ప్లాంట్ ప్రారంభం



వినుకొండ: పట్టణంలోని నరసరావుపేట రోడ్డులోని ఐరీష్ రెసిడెన్సి కన్వెన్షన్ ప్రారంభోత్సవంలో ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు పాల్గొని ఉచిత వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. విజయవాడ నుంచి వచ్చిన విద్యార్థినులు భరతనాట్య ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో తాళ్లూరి కాంతారావు, జనసేన పార్టీ నాయకులు నిశ్శంకర శ్రీనివాసరావు, రాయల్ శ్రీనివాసరావు, పులిపాటి రామారావు, పువ్వాడ కృష్ణ, పీవీ సురేష్‌బాబు, పులిపాటి రామారావు పాల్గొన్నారు.



బోయపాలెంలో ఈద్ బయాన్ చేస్తున్న ముఫ్తిసాబ్



చిలకలూరిపేటలో ఈద్గా వద్ద రంజాన్ సందేశం వింటున్న ముస్లింలు



యడ్లపాడులో పండుగ నమాజ్ చేస్తున్న ముస్లింలు

భక్తిశ్రద్ధలతో రంజాన్ వేడుకలు

- ఈద్గాలు, మసీదుల్లో ఈద్ నమాజ్
- ముస్లింవాడల్లో పండుగ కోలాహలం

యడ్లపాడు: రంజాన్ పర్వదినాన్ని ముస్లిం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. నెలరోజులు కఠిన ఉపవాస దీక్షలు చేపట్టిన ముస్లింలు ఆదివారంతో విరమించగా, షవ్వాల్ నెల ప్రారంభం రోజైన సోమవారం ఉదయం పండుగ పర్వదినాన్ని ఆనందోత్సవాలతో నిర్వహించుకున్నారు. ముస్లిం యువకులు, పెద్దలు, పిల్లలు కొత్త దుస్తులు ధరించి ఈద్గా, మసీదులకు చేరుకున్నారు. ఈద్గాలు, మసీదుల, ముస్లిం వాడలు పండుగ వాతావరణంతో కళకళలాడాయి. యడ్లపాడు, బోయపాలెం, కారుచోల గ్రామాల్లో ఈద్గాల వద్ద వంకాయలపాడు, లింగారావుపాలెం, సొలస, కోట, కొండవీడు గ్రామాల్లోని మసీదుల్లో ఈద్ ఉల్ ఫితర్ నమాజ్ పఠించారు. తిమ్మాపురం, జగ్గాపురం గ్రామాల్లోని ముస్లింలు యడ్లపాడు ఈద్గాకు చేరుకుని పండుగ నమాజ్‌ను చేశారు. అక్కడ ఏర్పాటు చేసిన షామియానాల్లో ముఫ్తీల నేతృత్వంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించగా, మత గురువులు రంజాన్ విశిష్టతను వివరించారు. ఉపవాస దీక్షలు జీవితానికి ఓ శిక్షణగా మారాలని, మానవత్వం, సేవాభావంతో నడుచుకోవాలని బయాన్ చేశారు. నమాజ్ అనంతరం, భక్తులు కన్నీటి దువాలతో ప్రపంచానికి శాంతి, సామరస్యాన్ని, మానవాళి సంక్షేమాన్ని అల్లాహ్ ప్రసాదించాలని ప్రార్థించారు. నమాజ్ పూర్తయ్యాకా మతపెద్దలు, ముస్లింలు ఈద్‌ముబారక్ (పండుగ శుభాకాంక్షలు) తెలుపుకుంటూ ఈద్గాల వద్ద పరస్పరం ఆలింగనం తెలుపుకున్నారు. దానధర్మాలు చేస్తూ ఇళ్లకు చేరుకున్నారు. సాయంత్రం ముస్లిమేతరులైన మిత్రులను తమ ఇళ్లకు ఆహ్వానించి ఈద్ కాదావత్‌తో చేశారు.



ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ, మాజీ ఎమ్మెల్యే మక్కెన, ముస్లింలు

వినుకొండలో...

వినుకొండ: రంజాన్ పండుగను ముస్లింలు ఘనంగా నిర్వహించారు. పట్టణం, మండలంలోని ఆయా మసీదుల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పట్టణంలోని ఈద్గా మైదానంలో సామూహిక ప్రార్థనల్లో ముస్లింలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. సామూహిక ప్రార్థనలో ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి ముస్లింలకు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

చిలకలూరిపేటలో....

చిలకలూరిపేట: నెల రోజుల ఉపవాస దీక్షల అనంతరం ముస్లింలు రంజాన్ పండుగను సోమవారం ముస్లింలు అత్యంత భక్తి శ్రద్ధలతో ఆనందోత్సాహాల నడుమ జరుపుకున్నారు. పట్టణంలోని వివిధ ప్రాంతాలు, గ్రామాల నుంచి తరలి వచ్చిన ముస్లింలు అడ్డరోడ్డు సెంటర్‌లో ఉన్న ఈద్గా మైదానంలో సామూహిక ప్రార్థనలు చేశారు. రంజాన్ సందేశాన్ని ముఫ్తి ఖలీల్ ఖాన్ వినిపించారు. సర్వమానవాళి సుఖసంతోషాలతో ఉండాలన్న ముఖ్య ఉద్దేశమే రంజాన్‌అని తెలిపారు. పొరుగువారి ఆనందాన్ని, వారి సౌఖ్యాన్ని ఆకాంక్షించి వారికి సహాయ పడటం, నిరుపేదలకు దానధర్మాలు చేయటంలోనే ఆనందం దాగి ఉందన్న విషయాన్ని రంజాన్ పండుగ గుర్తు చేస్తుందన్నారు. ప్రేమ, కరుణ, జాలి, సహనం త్యాగం, పరోపకారం, మానవ సమానతాన్ని రంజాన్ విశద పరుస్తుందన్నారు. ముఫ్తి పఠాన్ అనస్ ఖాన్ నమాజ్ చదివించి, ప్రత్యేక పార్థన చేయించారు. ప్రార్థనల అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకొని పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కులమతాలకు అతీతంగా పలువురు ఈద్గావద్దకు తరలివచ్చి ముస్లింసహోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ప్రత్యేక ప్రార్థనల సందర్భంగా అంజుమన్ ఇస్లామియా కమిటీ విస్తత ఏర్పాట్లు చేసింది.



శావల్యాపురం మసీదులో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న మౌలానా అబ్దుల్ రహిం

రొంపిచర్లలో...

రొంపిచర్ల: పవిత్ర రంజాన్ పండుగను ముస్లింలు మండలంలో సోమవారం ఘనంగా జరుపుకున్నారు. నెల రోజుల పాటు కఠిన ఉపవాస దీక్షలు చేపట్టి అనంతరం రంజాన్ పండుగను అత్యంత ఘనంగా నిర్వహించుకున్నారు. వారు ఒక్కరికొక్కరు ఈద్ ముబారక్ చెప్పుకున్నారు. మండలంలో సంతగుడిపాడు, రొంపిచర్ల, గోగులపాడు, కర్లకుంట, విప్పర్ల, ఎడ్వర్డ్ పేట, మునుమాక, విప్పర్లపల్లి, అన్నవరం గ్రామాలలో గల ఈద్గాల వద్ద ముస్లింలు సామూహిక ప్రార్థనలు చేశారు.

నాదెండ్లలో...

నాదెండ్ల: కరుణ, త్యాగం, దాతృత్వానికి ప్రతీక రంజాన్ పండుగను ముస్లిం సోదరులు శనివారం భక్తి శ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఉదయాన్నే ఈద్గాల వద్ద ప్రత్యేక నమాజ్ ఆచరించారు. ముస్లిం పెద్దలు రంజాన్ సందేశాన్ని వినిపించారు. సర్వమానవాళి శాంతిని ఆకాంక్షిస్తూ ప్రార్థించారు. గణపవరంలోని అప్పాపురం డొంకలో ఈద్గా వద్ద జరిగిన ఇమామ్ సర్ఫరాజ్ నమాజ్ అనంతరం దుఆ పఠించారు. పేదలకు ఫిత్రా దానం చేశారు.

శావల్యాపురంలో...

శావల్యాపురం: మండలంలోని కారుమంచి, వేల్పూరు, పోట్లూరు, మతుకుమల్లి, శావల్యాపురం తదితర గ్రామాల్లో రంజాన్‌ను ముస్లింలు సోమవారం ఘనంగా జరుపుతున్నారు. స్థానిక బీలాల్ మసీదులో షేక్ అబ్దుల్ రహిం మాట్లాడుతూ రంజాన్ పండుగ శాంతికి శుభాసూచకమన్నారు. అనంతరం మసీదులో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మసీదుల్లో అందరు భక్తిభావంతో సామూహిక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఒకరునొకరు ఆలింగనం చేసుకొని అనంతరం రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు.



గణపవరం ఈద్గా వద్ద నమాజ్ ఆచరిస్తున్న ముస్లిం సోదరులు



ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



చిలకలూరిపేటలో దువా నిర్వహిస్తున్న ముఫ్తి అనస్‌ఖాన్

కులవ్యవస్థ ఉన్నంత వరకూ అసమానతలు వీడవు



కనపర్రు ఎస్సీ కాలనీలో మాట్లాడుతున్న సీహెచ్ సుబ్బారావు

నాదెండ్ల: కుల వ్యవస్థ ఉన్నంత కాలం అస్పృశ్యత, సామాజిక వివక్ష రూపాలు మార్చుకుంటూ కొనసాగుతూనే ఉంటుందని భారత రాజ్యాంగ పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు సీహెచ్ సుబ్బారావు చెప్పారు. కనపర్రు ఎస్సీ కాలనీలో సోమవారం సమావేశం నిర్వహించారు. దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి 75 ఏళ్ళు అయినా ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీలు వివక్ష, అణచివేతకు గురౌతున్నారన్నారు. జనాభా ఆధారంగా రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. విద్య, వైద్యం, పరిశ్రమలు ప్రభుత్వ రంగంలో కొనసాగిస్తేనే అసమానతలు తొలగుతాయన్నారు. ప్రైవేటు రంగంలో కూడా రిజర్వేషన్లు అమలు జరిగేలా ప్రభుత్వాలు చొరవ చూపాలన్నారు. భారతదేశ సంపదలో అగ్రభాగం కేవలం 10 శాతం మంది చేతుల్లో పోగుపడిందని, 145 కోట్ల జనాభాలో 90 శాతం మంది ఆర్థిక అసమానతలతో సతమతమౌతున్నారన్నారు. దేశాన్ని సుస్థిర అభివృద్ధి, అసమానతలు లేని విధంగా పాలించే నాయకులకే రాబోయే రోజుల్లో ఓటు వేసి గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో వెంకటరావు, వెంకటనారాయణ, ఉసర్తి బుజ్జి, సాయి పాల్గొన్నారు.

వైభవంగా రెడ్డి పేరంటాలమ్మ ఆలయ వార్షికోత్సవం



ఆలయంలో సన్మాన గ్రహీతలతో కమిటీ సభ్యులు

నాదెండ్ల: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పు సాతులూరు గ్రామంలోని రెడ్డిపేరంటాలమ్మ తల్లి ఆలయంలో సోమవారం వార్షికోత్సవం వైభవంగా జరిగాయి. ప్రతి ఏడాది ఉగాది పర్వదినాన ఆలయ వార్షికోత్సవం నిర్వహించటం ఆనవాయితీగా వస్తుంది. భక్తులు వేకువజాము నుంచే ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. మొక్కుబడులు తీర్చుకున్నారు. ప్రభలు కట్టి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. పలువురు దాతలు ప్రసాదాలు పంపిణీ చేశారు. గ్రామస్తులే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తుల సౌకర్యార్థం బారికేడ్లతో క్యూలైన్లు ఏర్పాటు చేశారు. రాత్రి భారీ విద్యుత్ ప్రభను ఏర్పాటు చేశారు. మరో రెండు చోట్ల పాట కచేరీ నిర్వహించారు. సుమారు రెండు శతాబ్దాల క్రితం నిర్మించిన ఆలయం శిథిలావస్థకు చేరటంతో రూ.2 కోట్ల వ్యయంతో నూతన ఆలయాన్ని నిర్మించిన విషయం విదితమే. మార్చి 17న పునః ప్రతిష్టను వైభవంగా నిర్వహించారు. ఆలయ వాస్తు సిద్ధాంతి నెమ్మికంటి నరసయ్యాచారి, ఆలయ రాతి నిర్మాణ రూపకర్త సుబ్రహ్మణ్యాచారి, గోపుర శిల్ప కళాకారుడు పులకల లక్ష్మణను ఆలయ కమిటీ సభ్యులు సోమవారం బంగారు ఉంగరాలు, నూతన వస్త్రాలు బహూకరించి సత్కరించారు. కార్యక్రమంలో కమిటీ చైర్మన్ వజ్జా వీరాంజనేయులు, సభ్యులు జంపని లక్ష్మీనారాయణ, చెన్నబోయిన వెంకట సుబ్బారావు, తమ్మ సీతయ్య, వజ్జా రామారావు, నర్రా శ్రీనివాసరావు, వజ్జా వెంకటరావు, గొర్రె సాంబశివరావు పాల్గొన్నారు.

నల్ల రిబ్బన్లతో ముస్లింల నిరసన

- వక్ఫ్‌బోర్డు కొత్త చట్టాన్ని వ్యతిరేకిస్తూ రంజాన్ పర్వదినాన శాంతియుత నిరసన
- సామూహిక నమాజ్‌లోనూ తీయని నల్లరిబ్బన్లు
- కొండవీడు దాదాపీర్ దర్గా ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు నిరసన



కొండవీడు దాదాపీర్ దర్గాలో దువా అనంతరం నల్లరిబ్బన్లతో నిరసన చేస్తున్న కమిటీ సభ్యులు

యడ్లపాడు: భారత ప్రభుత్వం పార్లమెంట్‌లో నూతనంగా ప్రవేశ పెట్టనున్న వక్ఫ్‌బోర్డు యాక్ట్‌ను వ్యతిరేకిస్తూ ముస్లింలు నిరసన గళాన్ని తెలిపారు. పవిత్ర రంజాన్ పర్వదినం నాడు ఈద్ నమాజ్‌కు కొత్త దుస్తులు ధరిస్తూ బయలు దేరిన వారంతా తమ చేతులకు బ్లాక్ రిబ్బన్‌ను కట్టుకుని శాంతి యుతంగా తమ నిరసనను వ్యక్తం చేశారు. చిలకలూరిపేట నియోజకవర్గంలోని పట్టణం, నాదెండ్ల, యడ్లపాడు, చిలకలూరిపేట మండలాల్లోని అన్ని మసీదుల పరిధిలోని ముస్లింలందరూ ఇంటి నుంచి వెళ్లేటప్పుడు కట్టుకున్న రిబ్బన్లను సామూహిక నమాజ్ పూర్తయ్యే వరకు ఉంచుకున్నారు. భారత ప్రభుత్వం వక్ఫ్‌బోర్డులో తీసుకురానున్న నూతన చట్టం ముస్లిం సమాజానికి తీవ్ర అన్యాయం చేస్తుందని, తమ హక్కులను పరిరక్షించుకునేందుకు మొదటిగా ఇలా శాంతియుతంగా నిరసనను వ్యక్తం చేస్తున్నట్లు వెల్లడించారు. భారత ప్రభుత్వం దీనిని పరిగణంలోని తీసుకుని, నూతన బిల్లును ఉపసంహరించుకోవాలని కోరారు. లేకుంటే భవిష్యత్తు ముస్లింలోని అన్ని సంఘాలు సంఘటితంగా పోరాటాన్ని కొనసాగించనున్నట్లు తెలిపారు. కొండవీడు గ్రామంలో ముస్లిం, హజరత్ సయ్యద్ ఖుదాదే ఫకీర్షా వలియా (దాదాపీర్) దర్గా యాజమాన్య కమిటీ ఆధ్వర్యంలో దర్గా వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. భారత ప్రభుత్వం ముస్లింలకు నష్టం కలిగించే ఈ బిల్లును పసంహరించుకోవాలంటూ దర్గాలో దువా చేశారు. కార్యక్రమంలో కమిటీ కార్యదర్శి సయ్యద్ షహీన్‌షా, సభ్యులు సయ్యద్ వహిద్, జామల్, సనావుల్లా, హసన్, జహంఘీర్ తదితరులు పాల్గొన్నారు.

ఉగాది పురస్కారాలు అందజేత



భాగీ కృష్ణమూర్తిని సన్మానిస్తున్న సభ్యులు

చిలకలూరిపేట: ఆదిత్య బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు ఆదివారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ఓగేరువాగు సమీపంలో సంఘ భవన ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన తూబాటి లక్ష్మీనారాయణ కళావేదికను ప్రారంభించి, వేడుకలు నిర్వహించారు. గబ్బిటి వెంకటేశ్వరశాస్త్రి పంచాంగ శ్రవణంతో సభ ప్రారంభమైంది. సభకు సంఘ అధ్యక్షుడు ఏకా మారుతీ శర్మ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ భక్తిగీతాల కళాకారుడు, రేడియో, దూరదర్శన్ కళాకారుడైన భాగీ కృష్ణమూర్తి, భరతనాట్య కళాకారిణి గాలి రేవతిదేవిలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో చల్లా విజయకుమార్, పోలూరు చంద్రమౌళి, ధూళిపాళ శ్రీకాంత్, తూబాటి లక్ష్మీ నరసింహమూర్తి పాల్గొన్నారు.

98.2 శాతం పశువుల సర్వే పూర్తి



శావల్యాపురం: జాతీయ పశు గణాంకాల సర్వే పనులు 98.2 శాతం పూర్తి అయినట్లు స్థానిక పశువైద్యశాల వైద్యాధికారి సోముల గుణధీర్ అన్నారు. సోమవారం స్థానిక పశువైద్యశాలలో మాట్లాడుతూ మండలంలోని 15 గ్రామపంచాయతీలలో పశువులు-16 వేల 976, జీవాలు-14130 ఉన్నాయని 6 మంది ఎన్యూమెటర్లు ఇద్దరు సూపర్‌వైజర్లు పర్యవేక్షణలో సర్వే కార్యక్రమం విజయవంతం చేసినట్లు తెలిపారు. పశు గణాంక సర్వే వలన కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల బడ్జెట్‌లో నిధులు కేటాయింపు టీకాలు, మందులు, రాయితీ పథకాలు తదితరవన్నీ అంచనాలు వేయటానికి దోహదపడుతుందన్నారు. ప్రస్తుతం సర్వే చేసిన అంశాలన్నీ కేంద్ర ప్రభుత్వం రూపొందించిన ప్రత్యేక యాప్‌లో ఆన్‌లైన్‌లో నమోదు పనులు చేస్తున్నట్లు తెలిపారు. రైతు సమగ్ర వివరాలు, ఆధార్, సెల్‌ఫోను నంబరు.ట్యాగ్ నంబరు, తదితరవన్నీ తప్పులు లేకుండా పారదర్శకంగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. పదిరోజుల వ్యవధిలో ఆన్‌లైన్ పనులు పూర్తి అవుతాయన్నారు.

తిరునాళ్లు విజయవంతం

శావల్యాపురం: మండలంలోని శానంపూడి శివారు గ్రామమైన బొందిలిపాలెంలో వేంచేసియున్న శ్రీఅడవి పేరంటాళ్ళమ్మ అమ్మవారి తిరునాళ్ల వేడుకలు అన్నీ శాఖల అధికారుల గ్రామస్తులు ఆలయ కమిటి సభ్యులు సహకారంతో విజయవంతం చేశారని దేవదాయ అధికారి యం.సుధాకర్‌రెడ్డి సోమవారం తెలిపారు. సుమారు 60 వేలమంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారనీ, గత ఏడాది కంటే అదనంగా ఆదాయం వచ్చినట్లు తెలిపారు. పోలీసు, దేవదాయ అధికారులు కీలకపాత్ర షోషించారని వివరించారు.



కొమ్మ కొమ్మకో..





వినుకొండలో ప్రధాన రహదారికి ఓ వైపున మున్సిపల్ సిబ్బంది నాటిన చెట్ల నుంచి వస్తున్న పుష్పాలు కనువిందు చేస్తున్నాయి. ఎక్కడా చెట్టుకి ఒక్క ఆకు లేకపోయినప్పటికీ కొమ్మకొమ్మకి నిండుగా రంగు రంగుల పూలు అటుగా వచ్చివెళ్లే వారిని కనువిందు చేస్తున్నాయి. మండు వేసవిలో కూడా ఇలా పూలతో రహదారి కనిపిస్తుండటంతో పలువురు ప్రకృతి ప్రియులు ఆసక్తిగా ఈ చెట్లను ఫొటోలు తీసుకుంటూ ఆనందిస్తున్నారు. శిశిరం వెళ్లి వసంతం వచ్చింది కదా.. అందుకే పుష్పించి ఉంటాయని వారంతా అనుకోవడం కనిపించింది. -వినుకొండ